క్లుప్తంగా

ఇంటింటికీ అయోధ్య అక్షతల పంపిణీ

పెదపూడి: మండలంలోని వేంద్రలో సర్పంచ్ కోసూరి వాసు ఆధ్వర్యంలో అయోధ్యలో రామమందిర నిర్మాణ పూజ అక్షతలు, రామమందిర చిత్రాలను భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేసి అనంతరం పంపిణీ చేపట్టారు. 22వ తేదీన అయోధ్య విగ్రహ ప్రతిష్ఠ అనంతరం సాయంత్రం 6 గంటలకు ప్రతి ఇంటి ముందు దీపాలను వెలిగించి అక్షతలను శిరసున ధరించాలని కోరారు. కార్యక్రమంలో పైన సొసైటీ డైరెక్టర్ పేపకాయల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం



బలభద్రపురంలో గరుడ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. సుప్రభాత సేవ, లఘు అర్చన, తోమాల సేవ, పంచామృతాభిషేకం, గోపూజ, పవళింపు సేవ చేశారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగిస్తూ గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి వారు

పెదపూడి: మండంలోని సంపర వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి శనివారం ఉదయం విశేష పూజలు చేశారు. పంచామృతాభిషేకం, తులసి పూజ, గోదా అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సారా కేసులో మహిళ అరెస్ట్

రంగంపేట: సారా కేసులో మహిళను అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. శనివారం రాత్రి ఆమె మాట్లాడుతూ మండలంలోని పెద్ద దొడ్డిగుంట గ్రామంలో తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన చలబోయిన సూర్య నాగమణి 16 లీటర్ల సారా కలిగి ఉండటంతో స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసి పెద్దాపురం కోర్టుకు తరలించామన్నారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం వెళ్లి పింఛన్ అందజేత



రాజమహేంద్రవరం వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ మమత

బిక్కవోలు: మండలంలోని పందలపాకకు చెందిన పింఛన్‌దారుడు యాసలపు వీరవెంకట సత్యనారాయణ అనారోగ్యంతో ఐదు నెలలుగా రాజమహేంద్రవరంలోనే నివాసముంటున్నాడు. దీంతో వలంటీర్ గొర్రిపోటి మమత ప్రతీనెలా రాజమహేంద్రవరం వెళ్లి అతడికి పింఛన్ అందజేస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరవేస్తున్న వలంటీర్ మమతను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డిలు అభినందించారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

సీతానగరం: వంగలపూడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. శనివారం వంగలపూడి శివారున పేకాట ఆడుతున్న ఏడుగురి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,860 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సచివాలయం వద్ద శనివారం క్రీడాకరులకు టీ షర్టులు, క్యాప్‌లు, కిట్లను పంపిణీ చేశారు. పంచాయతీ సెక్రటరీ తాతపూడి జాకబ్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు కంటే వినయ్‌తేజ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు కిట్లు అందించడం మంచిదన్నారు. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు ఏవీఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంతోషమే జగనన్న ఆకాంక్ష

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



దొడ్డిగుంటలో లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: వృద్ధులు, వితంతువులు, వికలాంగుల ముఖాల్లో చిరునవ్వు, సంతోషం చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నల్లమిల్లి, సింగంపల్లి, దొడ్డిగుంట, సుభద్రంపేట, కోటపాడు గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు నల్లా పద్మ, శివశంకర ఆనంద్, కారి సంజీవరావు, కూటి సాయి తాతారావు, గవరసాని లక్ష్మీదుర్గ అధ్యక్షతన లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా ప్రతీనెలా రూ.3 వేలు పింఛన్ ఇవ్వడం జగనన్నకే సాధ్యమన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో రెండేళ్ల పాటు కరోనా కష్టకాలం ఉన్నా రూ.3.65 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ చేశారన్నారు. టీడీపీ నాయకులు డ్రామాలు ఆడుతూ వస్తున్నారని వారికి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. డ్వాక్రా, రైతు, బంగారు రుణాలు మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు అందరినీ మోసం చేశారని, అలాంటి వారిని నమ్మవద్దని చెప్పారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం లబ్ధిదారులకు రూ.3 వేలు చొప్పున పింఛను సొమ్మును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పి.రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలందరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

అనపర్తి: పేదలందరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పొలమూరులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక పెన్షన్లను రూ.3 వేలకు పెంచడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు పెన్షన్ సొమ్మును ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, రాష్ట్ర రెడ్డి, భత్రాజుల కార్పొరేషన్ల డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, సత్తి రామారెడ్డి, ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, ఎంపీటీసీ సత్తి కనకారెడ్డి, మాజీ సర్పంచ్ మేడపాటి గంగిరెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు 'అక్షయామృతం'

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- నిత్యాన్నదాన పథకం ప్రారంభం



సీతానగరంలో అన్నదాన కార్యక్రమంలో భోజనం వడ్డిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జక్కంపూడి అక్షయామృత నిత్యాన్నదాన సేవ పథకం ద్వారా నియోజకవర్గంలో నిరుపేద ప్రజలకు భోజనం అందిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. శనివారం సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్ వద్ద జక్కంపూడి అక్షయామృత నిత్యాన్నదాన పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ నిరుపేదల ఆకలిని తీర్చడానికి పథకం పెట్టామని, దీని ద్వారా వారంలో ఒక రోజు నాన్‌వెజ్‌తో కూడిన పోషకాహారాన్ని అందిస్తామన్నారు. మూడు మండలాల్లోను ప్రతి రోజు రెండు గ్రామాల్లో నిత్యాన్నదాన పథకం అమలుఅవుతుందని చెప్పారు. సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు మహిళలకు ముగ్గులు, గొబ్బెమ్మలు, బోగి మంటలు, బొమ్మల కొలువులు వంటి పలు రకాల పోటీలను నిర్వహిస్తామని, మొదటి బహుమతి వాషింగ్ మిషన్, రెండో బహుమతి మిక్సీ, మూడో బహుమతి డిన్నర్ సెట్లు అందించడంతో పాటు పోటీల్లో పాల్గొన్నవారందరికీ బహుమతులు అందిస్తామన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ళ వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కొండ్రపు ముత్యాలు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, ఉపసర్పంచులు సత్తిపండురాజు పాల్గొన్నారు

మధురపూడి: కోరుకొండ బస్‌స్టాండ్ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం అక్షాయామృతం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉభయ గోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సహకారాన్ని అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కో-ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్‌కుమార్, తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, కేతినీడి అశోక్, పత్తి పాపారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల అందజేత



అనపర్తిలో మెరిట్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న దాత, ప్రజాప్రతినిధులు

అనపర్తి: 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర ర్యాంకులు సాధించిన విద్యార్థులకు దాత కాళ్ల శ్రీను శనివారం స్థానిక శ్రీరామారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన విద్యార్థి మహాపాత్రో మిట్టు ప్రథమ స్థానంలో నిలవగా, అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఏపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని కామిరెడ్డి హేమశ్రీ రెండో స్థానం, గుంటూరు బీఎస్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థి పానుగుపాటి శ్రీనివాసరావు తృతీయ స్థానం సాధించారు. వారికి ల్యాప్‌టాప్‌లతో పాటు పాఠశాలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కూడా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కె.దాసు, పాఠశాల హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి, ఎంపీటీసీ బందారు శ్రీనివాసు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జె.సత్యవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన తెలుగు భాషా సంబరాలు



పలువురి మన్ననలు అందుకున్న శ్రీనివాసుని కల్యాణం నృత్య రూపక దృశ్యం

- జోష్ పుట్టిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- ఉత్సాహంతో ఉరకలేస్తున్న యువత



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

రాజానగరం: సంస్కృతి, సాహిత్యాలకు కేంద్ర బిందువుగా విరాజిల్లుతూ చారిత్రిక నగరంగా పేరొందిన రాజమహేంద్రవరం సమీపంలోని గైట్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభలు గత రెండు రోజులుగా భాష సౌగంధాలను వెదజల్లుతూ, శోభాయమానంగా సాగుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఇస్తున్న సాంస్కృత ప్రదర్శనలు సైతం అబ్బురపరచే రీతిలో జరుగుతున్నాయి. మహాసభల్లో రెండో రోజైన శనివారం రాజరాజనరేంద్రుని వేదికపై సీతానగరానికి చెందిన జ్ఞాననిధి స్కూల్ విద్యార్థులు ఇచ్చిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. కోటా సిస్టర్స్ కూచిపూడి నృత్య ప్రదర్శనలతో కేరింతలు కొట్టించారు. అదేవిధంగా మరి కొంత మంది విద్యార్థులు నృత్యాలు, నృత్య రూపకాలతో అందరినీ అలరించాయి. ఇంజినీరింగ్ విద్యార్థులు సైతం జేజేలు పలుకుతూ హుషారుతో ఉరకలేశారు.

భక్తులతో కనువిందు చేసిన శ్రీనివాసుడు

అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగే ప్రాంగణంలోనే శ్రీవారి వైభవంలో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తిరుమలేశుని నమూనా దేవాలయం వద్ద శనివారం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. మహాసభలకు వచ్చిన పెక్కుమంది భక్తులు శ్రీనివాసుని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు తీసుకున్నారు.

ఆడుదాం ఆంధ్రాను జయప్రదం చేయాలి



ఆడుదాం ఆంధ్రా క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సాయిబాబా

పెదపూడి: ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను అందరూ జయప్రదం చేయాలని ఎంపీడీఓ వీవీ సాయిబాబా కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆడుదాం ఆంధ్రా క్రీడా దుస్తులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జరిగే క్రీడల ద్వారా క్రీడాకారులు మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. క్రీడల ద్వారా మంచి ఉన్నత భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం. సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ

సీతానగరం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులకు ప్రభుత్వం అందించిన క్రీడా కిట్లను వైఎస్సార్ సీపీ రైతు విభాగం సభ్యులు జొన్నలగడ్డ సత్యనారాయణ పంపిణీ చేశారు. శనివారం మిర్తిపాడు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి డి.విజయదుర్గ ఆధ్వర్యంలో సత్యనారాయణ చేతుల మీదుగా క్రికెట్, వాలీబాల్ టీమ్‌ల కిట్లను అందజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడాలతో మానసిక దృఢత్వంతోపాటుఏ మంచి ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి, పార్టీ నాయకులు ఏక రాజు, మాకిరెడ్డి సాయి కళ్యాణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు